
**కామెడీ కథ**

## కామేశం చిన్నప్పట్నుంచి అంతే!

**ఏదైనా ఆలోచన వస్తే దాన్ని అమలుజరిపేంత వరకూ ఊర్కోడు. ఆ విషయంలో పట్టువిడుపులుండవు. విక్రమార్కుడి టైపన్నమాట. తద్వారా అవతలి వాళ్ళకు గొంతులో పచ్చి వెలక్కాయ పడవచ్చు. అష్టకష్టాలు రావచ్చు. ప్రాణసంకటం కలగవచ్చు. కానీ అతనవేం పట్టించుకునే రకం కాదు.**

అటువంటి కామేశానికి అకస్మాత్తుగా పెద్ద కవినై పోవాలనే కోరిక పుట్టింది. బలంగా బంతిని బాదటానికి బూస్ట్ కారణమైనట్లు, అతనికి ఆ ఆలోచన రావటం వెనుకా ఓ రీజనుంది.

సదానందం కామేశం పనిచేసే ఆఫీసులో సాదా సీదా ఉద్యోగి. అప్పుడప్పుడూ ఉబుసుపోక కవితలంటూ ఏవో రాస్తూంటాడు. మొన్నామధ్య ఏదో సంఘం వాళ్ళు జిల్లాస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తే, మనవాడు అందులో పాల్గొని ఏకంగా మొదటి ప్రైజు కొట్టేశాడు. ప్రైజుమనీ ఐదు వేలు!




దాంతో ఒక్కసారిగా ఆఫీసులో 'హీరో' అయిపోయాడు. ఆఫీస్ స్టాఫ్ అతన్ని పొగడని రోజంటూ లేదు. హఠాత్తుగా అతనికి లభిస్తున్న గౌరవాభిమానాలకు, ఆశ్చర్యంతో తలమునకలైపోయాడు కామేశం. నిన్నటి దాకా ఆఫీసులో తన ఛరిష్మాకి ఎదురులేదు. తను అవునంటే అవును, కాదంటే కాదు. అలాంటిది, ఇప్పుడు... తన పాపులారిటీకి ప్రతిబంధకంగా సదానందం సాక్షాత్కారించాడు.

సదానందం తన క్రింది ఉద్యోగి. పెద్దగా చదువుకోలేదు. తను అతని బాస్. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. సాధారణ చదువులు చదివిన సదానందమే సొంత కవిత్వం వెలగబెట్టగా లేంది, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన తను, ప్రబంధం రాయలేడా అనుకున్నాడు. అందుకే కవిత్వం రాయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు కావాల్సిన సరంజామా అంతా సిద్ధం చేసుకున్నాడు.

అయితే విఘ్నేశ్వరుడి పెళ్ళికి వెయ్యి విఘ్నాలన్నట్లు, ఏ విషయం మీద కవిత్వం రాయాలనే సందేహం కలిగిందతనికి. ఈ విషయమ్మై కొంత తర్జనభర్జన పడి, కాసేపు తల గోక్కున్నాడు. అంతలో 'కుక్కపిల్లా సబ్బుబిళ్ళ..' అన్న శ్రీశ్రీ కవిత గుర్తొచ్చింది. వెంటనే హుషారుగా తనకు నచ్చిన విషయాల మీద కవితలు రాయడం మొదలుపెట్టాడు. పుంఖానుపుంఖాలుగా పేజీలు నింపాక, వాటినోసారి తనివిదీరా చదువుకున్నాడు. చాలా సంతోషం వేసింది. తన టాలెంట్‌కు తనే మురిసిపోయి, ఐరావతం ఎక్కిన ఇంద్రుడిలా ఫీలైపోయాడు.

కవిత్వం రాస్తే సరిపోదు. రాసినట్టు అందరికీ తెలియాలి. అందుకే కామేశం ఓ ఉపాయం ఆలోచించాడు. ఓ సండే సాయంకాలం తన ఇంట్లో చిన్న పార్టీ ఎనౌన్స్ చేశాడు. పార్టీ చివర్లో 'సర్‌ప్రైజ్' కూడా వుంటుందని సెలవిచ్చాడు. పిల్లికి బిచ్చం పెట్టని కామేశం పిలిచి పార్టీ ఇస్తాననే సరికి, ఆఫీస్ స్టాఫంతా మొదట అదిరిపడినా, తర్వాత తేరుకొని ఉల్లాసంగా వచ్చారు. పార్టీ కోసం కాకపోయినా, చివర్న ప్రకటించబడే 'సర్‌ప్రైజ్' కోసం కొంతమంది కుతూహలజీవులు కాళ్ళీడ్చుకుంటూ వచ్చారు. అతిథి మర్యాదలు అద్భుతంగా జరిగాయి. అందరూ సుష్టుగా లాగించి తీరిగ్గా ఆసీనులయ్యాక గొంతు సవరించుకుని ఓ పేపర్‌కట్టతో వారి ముందు ప్రత్యక్షమయ్యేడు కామేశం.

''మరేం లేదు! నేను కొన్ని కవితలు రాశాను. వాటిలో మచ్చుకు కొన్ని మీకు వినిపించాలని నా కోరిక'' అంటూ బాంబు పేల్చాడు నవ్వుతూనే.

ఊహించని ఈ ఉత్పాతానికి అంతా ఉలిక్కిపడ్డారు. వెర్రిమొహాలేసుకుని ఒకర్నొకరు చూసుకున్నారు. 'టీవీ కొన్నాక సీరియల్స్ భరించక తప్పదన్నట్లు' ధైర్యం చిక్కబట్టుకొని కూర్చున్నారు.

కామేశం ఈలోగా కాగితపు కట్టను దులిపి, మొదటి పేజీని అందుకున్నాడు.

''వేయించి తిన్నాక దొండ!
తాగాలి నీళ్ళు ఓ కుండ!'' అన్నాడు.

వెంటనే 'ధభి'మన్న శబ్దం వినపడింది. వెనుక వరుసలో కూర్చున్న వామన్రావు వెల్లకిల్లా విరుచుకుపడిపోయాడు. బిత్తరపోయి అంతా అటువైపు చూశారు.

''అబ్బే ఏం లేదు! నేనింత అద్భుతంగా కవిత్వం రాస్తానని అతను ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు. అందుకే ఆనందాతిశయంతో స్పృహ కోల్పోయాడు. అల్పజీవి కదా!'' తేల్చేశాడు కామేశం.

స్టాఫ్‌కు ముచ్చెమటలు పోసేశాయి!

కామేశం మరో లైను అందుకున్నాడు.

''శ్రీరాముని భార్య సీత!
సముద్ర తీరాన పీత!'' అన్నాడు.

మధ్య వరుసలో కూర్చొన్న మాణిక్యానికి మతిస్థిమితం తప్పింది. సంధి ప్రేలాపన చేస్తూ చేతికందిన వస్తువులు విసిరేయటం మొదలుపెట్టాడు. అతన్ని కంట్రోల్ చేసేసరికి ఆఫీస్ స్టాఫ్‌కు తల ప్రాణం తోకకొచ్చింది.

ఇంత జరుగుతున్నా కామేశానికి చీమ కుట్టినట్లుగా కూడా అనిపించలేదు. జాలీ దయ లాంటివి లేకుండా మరో గంట సేపు నిర్విఘ్నంగా తన కవితా పారాయణం కొనసాగించాడు. అతని కవిత్వం ధాటికి ఆఫీస్ స్టాఫంతా కుదేలైపోయారు. కొంతమంది హాహాకారాలు చేస్తూ మూర్ఛపోగా, మరికొందరు పక్షవాతం వచ్చిన వాళ్ళలా కుర్చీలకు అతుక్కుపోయారు. ఇంకొందరు వెంట తెచ్చుకున్న వాహనాలు సైతం వదిలేసి, గేటు తెరిచే వున్నా, గోడదూకి పరారయ్యారు. సదానందం కూడా కడుపునొప్పితో విలవిలలాడుతూ మెల్లగా జారుకుంటూండగా, కామేశానికి దొరికిపోయేడు.

''ఇంతకీ నా కవిత్వమెలా వుందో చెప్పనేలేదు?!'' నవ్వాడు కామేశం.

కుడితిలో పడ్డ ఎలుకలా కాసేపు గింజుకుని-

''కవిత్వానికి ఇంతటి శక్తి వుంటుందని నాకు ఇంతవరకూ తెలీదు సార్! వారం రోజుల క్రితం కేరళ కెఫేలో కొబ్బరినూనెతో చేసిన గారెలు తిన్నాను. అప్పుడు కూడా నిక్షేపంగా ఉన్నాను. కానీ... ఇప్పుడే కడుపులో ఏదో తేడాగా వుంది'' అన్నాడు సదానందం నీరసంగా.

''అంటే?!'' వదల్లేదు కామేశం.

''సార్! మీరు మహాకవి సార్! అందులో డౌట్ లేదు. కానీ ఇప్పుడు నన్నొదలకపోతే మాత్రం, ఆ తర్వాత జరిగే పరిణామాలకు నేను బాధ్యుడ్ని కాదు'' మెలికలు తిరిగిపోతూ అన్నాడు సదానందం.

సంతోషంగా వదిలేశాడు కామేశం.

అప్పట్నుంచీ అతని కవితాధారకు అడ్డే లేకపోయింది. తన పాండిత్యాన్ని ప్రపంచానికి చాటాలన్జైప్పేసి, కనబడ్డ ప్రతివారితో పరిచయం పెంచుకొని కొంపకు ఆహ్వానించడం మొదలుపెట్టాడు.

వాళ్ళకు అడ్డమైన చాకిరీలు చెయ్యలేక, కవిత్వం వింటూ, విన్న తర్వాత వాళ్ళు చేసే విన్యాసాలు, విధ్వంసాలు భరించలేక అతని భార్యకు చిర్రెత్తుకొచ్చేది. వారానికి అధమపక్షం మూడుసార్లైనా జరిగే ఈ 'కవిత్వపువిందు'ల పుణ్యమా అని, పట్టుమని పదేళ్ళైనా లేని కామేశం పుత్రరత్నం తండ్రి కవిత్వాలను కంఠతా పట్టేశాడు. సంతోషంగా ఉన్నప్పుడో, దుఃఖం కలిగినప్పుడో, కోపం వచ్చినప్పుడో... ఇలా ఫలానా సందర్భం అంటూ లేకుండా అన్ని సందర్భాలలో వాటిని వల్లించడం ప్రారంభించాడు. ఇవేవో కొత్త రకం తిట్లనుకొని కొంతమంది పిల్లలు జడుసుకొని, బిక్కమొగం వేసి స్కూలుకు రావడం మానేశారు. హాజరు తగ్గిపోతూండటంతో కంగారుపడ్డ ప్రిన్సిపాల్, విషయం ఆరా తీయించి, దీనికంతటికీ కారణం కామేశం కుమారుడే అని తెలుసుకున్నాడు. పిల్లాడి చేత 'ఆ పాడు మాటలు' మాన్పిస్తే కానీ అతన్ని స్కూలుకు అనుమతించమని, అతని తల్లికి తెగేసి చెప్పాడు. అసలే అర్థం పర్థం లేని విందులతో విసిగివేసారిన కామేశం భార్యకు ఈ మాటలు మరింత ఆగ్రహం తెప్పించాయి. దాంతో మొగుడితో గొడవేసుకొని 'కవిత్వం మానేస్తేకానీ కొంపలో అడుగుపెట్టన'ని శపథం చేసి, పిల్లాడ్ని తీసుకొని చక్కా పుట్టింటి రైలుబండి ఎక్కేసింది.

అయినా కామేశం బాధపడలేదు! ఎప్పటిలాగే దీక్షగా కవిత్వాలు రాస్తూనే ఉన్నాడు! పెళ్లాం పిల్లలు వెళ్లిపోయిన విషయం మీద, ఎవరైనా అతన్ని పరామర్శించి, సానుభూతి కురిపించబోతే 'ఇదేమంత పెద్ద విషయమా? మహామహులకే ఇటువంటివి తప్పలేదు. 'సోక్రటీస్ పెళ్లాం గయ్యాళి కాదా!' అంటూ తేలిగ్గా కొట్టిపడేసేవాడు. ఆ విషయాన్ని ప్రక్కనపెట్టి, కొత్తగా తను రాసిన కవిత్వాలను యధాశక్తి వారికి వినిపించేవాడు. పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్లు, పరామర్శించడానికి వచ్చిన వాళ్ళంతా బుద్ధితెచ్చుకొని, పిక్కబలం కొద్దీ పి.టి.ఉష రేంజిలో అక్కడి నుంచి పరుగెత్తాల్సి వచ్చేది. కామేశం ఆఫీసులో సైతం పరిస్థితి ఇంచుమించు అదేలా తయారైంది. అతని దెబ్బకు కొంతమందికి ఇదివరకెన్నడూ లేని తలనొప్పి, ఆయాసం, గుండెదడ, కడుపులో వికారాలు లాంటి అవలక్షణాలు పొడసూపాయి. ఇంకొంతమంది ఫైల్స్‌లో ఆఫీసు విషయాలకు బదులు అన్నమయ్య కీర్తనలు రాయటం స్టార్ట్ చేశారు. ఇలా అయితే లాభం లేదన్జెప్పి సదానందం ఓ మార్గమాలోచించి గుండెదిటవు చేసుకొని కామేశం కేబిన్లో దూరాడు.

అతన్ని చూడగానే కామేశం ఒక్క ఉదుట్న పైకి లేచి ఆనందంతో మీదపడి కౌగిలించుకున్నంత పని చేశాడు.




''రావోయ్ సదానందం! సరిగ్గా సమయానికొచ్చావ్. ఇందాకే నాకో బ్రహ్మాండమైన కవిత తట్టింది. విసరమంటావా?!'' అన్నాడు.

పొరబాట్న 'విసరండి' అన్నా జరగబోయే ప్రమాదం ఏమిటో పసిగట్టిన సదానందం, ఠక్కున అతని చేతులు పట్టుకొని-

''సార్! మీరు సరస్వతీపుత్రులు. మీ వర్చస్సు చూస్తేనే తెలుస్తుంది. మీ శక్తి ఏపాటిదో! మళ్ళీ మాకు రుజువులు కావాలా? కాకపోతే నాదో చిన్న మనవి. మీ కవితల్ని మాలాంటి అర్భకులపై విసిరేకన్నా, ఏ పత్రికల వాళ్ళపైనో విసరండి. పేరు ప్రఖ్యాతులు వాళ్ళే రాలిపడతాయి. మాపై విసిరితే, మేం వాటిని కాపీకొట్టి, మీకు రావాల్సిన పేరు మేమే కొట్టేసే ప్రమాదముంది'' అన్నాడు సలహా ఇస్తున్నట్లు.


బెల్లంకొండ లోకేష్ శ్రీకాంత్

కామేశం అతనితో ఏకీభవిస్తున్నట్లు తలూపి-

''నేనూ అదే అనుకుంటున్నాను. ఈ మధ్యకాలంలో నేను ఎడాపెడా కవితలు రాసేశాను. అయితే వాటిలో వేటిని పత్రికల వాళ్ళకు పంపాలో అర్థం కావడం లేదు. అన్నీ అద్భుతమైనవేననుకో! కానీ వాటిలో అత్యద్భుతమైనవీ, పత్రికల వాళ్ళ పల్స్‌కు అనుగుణంగా వుండేవి పంపిస్తే బావుంటుంది కదా? అందుకని వాటిని సెలెక్ట్ చెయ్యటానికి, నువ్వీ ఆదివారం మా ఇంటికి రావాలి!'' అన్నాడు.

అప్పుడే సున్నం కొట్టిన గోడలా తెల్లగా పాలిపోయింది సదానందం మొహం. కామేశం కవితల కట్టలు తలచుకోగానే అతని గొంతు తడారిపో

యింది. తప్పించుకోకపోతే తనకీ భూప్రపంచంతో సంబంధాలు మిగలవని గ్రహించాడు. చిన్నప్పుడెప్పుడో హరీమన్న తన తాత ఈమధ్యే పోయినట్లు కథలల్లి, ఈ ఆదివారం పెద్దకర్మ చేస్తున్నట్లు చెప్పి బావురుమన్నాడు. రాలేనని మొరపెట్టుకున్నాడు.




''సర్లే! ఆ కవితలేవో నేనే ఎంపిక చేస్తాను. కానీ నువ్వు కూడా నాతోపాటూ పత్రికాఫీసుకు రావాలి. నా కవిత్వాన్ని నువ్వొక్కడివే బాగా అర్థం చేసుకున్నావు. నా సంక్లిష్ట భావాలు ఒకవేళ ఎడిటర్‌కు అర్థం కాకపోతే, అతనికి విషయం విడమరచి చెప్పగల ఏకైక వ్యక్తివి నువ్వే'' అన్నాడు కామేశం.

సదానందానికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. అతనికి వొప్పుకోక తప్పింది కాదు.

ఓ రోజు సాయంకాలం ఇద్దరూ పత్రికాఫీసుకు వెళ్ళారు. సదానందానికి ఎడిటర్‌తో మంచి పరిచయం వుంది. కామేశాన్ని పరిచయం చేసి వచ్చిన విషయం విశదం చేశాడు.

ఎడిటర్ ఓసారి కామేశాన్ని తేరిపార చూసి-

''ఓహో.. అలాగా..'' అని ''ఏదీ..కొన్ని కవితల్ని వినిపించండి'' అన్నాడు.

అనడమే ఆలస్యం కామేశం తన సంచిలో నుంచి ఓ కట్టను బయటికి లాగి మొదటి పేజీ అందుకున్నాడు.

''దురదగా వుంటుంది కంద!
నా జేబులో వుంది వో వంద!'' అన్నాడు.

వెంటనే ఎడిటర్ ముఖకవళికలు మారిపోయాయి. నీళ్ళు నములుతూ సదానందం వైపు చూశాడు. విచిత్రంగా అతని మొహం చిర్నవ్వుతో వెలిగిపోతోంది.

కామేశం రెండో కవిత అందుకున్నాడు.

''ముప్పూటలా మేస్తాను ములక్కాయ!
అప్పుడప్పుడూ తింటాను ఆవకాయ!'' అన్నాడు.

అవాక్కయిపోయాడు ఎడిటర్. డబ్బాలో గులకరాళ్ళు పోసినట్లుండే ఈ టైపు కవితల్ని అతనెప్పుడూ విన్లేదు!

కామేశం మాత్రం తన లోకంలో పడిపోయి-

'వంటకు కావాలి గ్యాసు-బస్సులకు వుండాలి పాసు' లాంటి కవితలను తన్మయత్వంతో చెప్పుకుపోతున్నాడు. ఎడిటర్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. కుర్చీలో అసహనంగా కదిలాడు. గ్లాసులో ఉన్న నీళ్లు ఖాళీ చేసి, గట్టిగా దగ్గాడు. పైకి లేచి అటూ ఇటూ పచార్లు చేశాడు. కాసేపు కుర్చీలను టేబుల్‌ను బరబరా లాగాడు. తిక్కరేగి పేపర్ వెయిట్ నేలకేసి కొట్టాడు.

...అయినా కామేశం కవితాపారాయణం ఆగలేదు. హతాశుడైపోయిన ఎడిటర్ కామేశం రెండు చేతులు పట్టుకుని-

''మహాప్రభో! ఆపండి! దయచేసి ఇక ఆపండి'' అంటూ వేడుకున్నాడు.

అప్పటికిగాని కామేశం ఉపశమించలేదు. సదానందం తన చెవిలోంచి దూదిపింజలు తియ్యటం అప్పుడు గమనించాడు ఎడిటర్. ఒళ్ళు మండి అతని కాలర్ పట్టుకుని-

''ఏవయ్యా! దీనికంతటికీ కారణం నువ్వు కాదూ?! పోనీలే బాగా రాస్తావని చనువిస్తే, ఈ ప్రళయాన్నొకటి వెంటబెట్టుకొని వస్తావా? ఇంకోసారి ఇలా చేశావంటే నీ కవిత కాదు, కర్మకాండను ప్రచురిస్తాను'' అంటూ హెచ్చరించాడు.

సదానందం భయంతో బిక్కచచ్చిపోయాడు.

తన కవితల్ని కామెంట్ చేసేసరికి కామేశం చిన్నబుచ్చుకున్నాడు.

''మీకర్థం కాకపోతే మానేయండి! అంతేగానీ నా కవితల్ని ఇన్సల్ట్ చెయ్యద్దు'' అన్నాడు.

ఎడిటర్ కోపం నషాళానికి పాకింది.

''నోర్ముయ్! ఇవి కవితలా? 'ముప్పూటలా మేస్తాను ములక్కాయ, అప్పుడప్పుడు తింటాను ఆవకాయా?' లాగిపెట్టి ఒక్కటిచ్చానంటే దాన్నంటారు లెంపకాయ. నువ్వు రోజూ తినే కూరలు, నలుగురికీ తెలిసిన సంగతులు వాక్యాలుగా పేర్చి కవితలంటావా? ఏవిటీ? 'దురదగా వుంటుంది కంద, నీ జేబులో వుంది వో వందా?' నీ బొంద. కందకూ నీ జేబులో వున్న వందకూ ఏమైనా సంబంధం ఉందా? వెళ్ళు! ముందు ఇక్కడ్నుంచి వెళ్ళు. ఇంకోసారి ఈ పరిసర ప్రాంతాలలో తచ్చాడుతున్నట్టు తెల్సిందో న్యూసెన్స్ కేసు క్రింద జైల్లో వేయిస్తాను'' అంటూ దులిపేశాడు.

కామేశానికి పౌరుషం పొడుచుకొచ్చింది.

''చాల్చాల్లేవయ్యా! నీ పత్రిక కాదంటే, దాన్ని మించిందింకొకటి'' అంటూ కవితల సంచి తీసుకుని విసురుగా వెళ్ళిపోయాడు.

సదానందం మాత్రం ఎడిటర్ కాళ్ళావేళ్ళాపడి, క్షమాపణ కోరుకుని 'బ్రతుకు జీవుడా' అంటూ బయటపడ్డాడు.

కొసమెరుపు: వేరే బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న సదానందం సంతోషంగా వెళ్ళిపోయాడు. కామేశం మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా పత్రికల ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాడు.

అతని కోరిక ఫలించాలని ఆశిద్దామా?!